వెలుగోడులో ఉద్రిక్తత

వెలుగోడు పట్టణంలో శనివారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. శుక్రవారం జరిగిన వినాయక నిమజ్జనంలో భాగంగా గణనాథులను జమ్మినగర్‌తండా సమీపంలో గాలేరు నదిలో నిమజ్జనం చేసేందుకు ట్రాక్టర్లలో ఊరేగింపుగా తీసుకెళ్తున్నారు. ఈక్రమంలోనే ఓ ప్రార్థనా మందిరం వద్ద డప్పులు వాయిస్తూ ఊరేగింపుగా వెళ్లేందుకు ఓ వర్గం వారు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొంది. ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకున్నారు. హుటాహుటిన కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, ఏఎస్పీ యుగంధర్ వెలుగోడుకు చేరుకున్నారు. ఇరువర్గాలకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. ఈక్రమంలోనే శుక్రవారం అర్ధరాత్రి దాటాక ఓ వర్గానికి చెందిన వారంతా వినాయక విగ్రహాలను ట్రాక్టర్ ట్రాలీల్లోనే ఉంచి వాటిని ఎక్కడికక్కడే రోడ్లపై నిలిపివేసి ఇంజన్లను తీసుకెళ్లారు.

● ఆత్మకూరు/ వెలుగోడు(ఆంధ్రజ్యోతి)



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న హైందవ సంఘాల ప్రతినిధులు



శుక్రవారం అర్ధరాత్రి రోడ్లపైనే వినాయక విగ్రహాలను నిలిపి ఉంచిన దృశ్యం

- వినాయక నిమజ్జన ఊరేగింపులో ఘర్షణ
- రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- తరలివచ్చిన హైందవ సంఘాల ప్రతినిధులు
- పోలీస్‌స్టేషన్ ఎదుట 8గంటలు బైఠాయింపు
- అధికారుల తీరుకు నిరసనగా నినాదాలు
- పరిస్థితిని పర్యవేక్షించిన డీఐజీ, ఎస్పీ
- ఎట్టకేలకు ప్రశాంతంగా ముగిసిన నిమజ్జనం

భారీ బందోబస్తు మధ్య ఊరేగింపు



మాట్లాడుతున్న డీఐజీ కోయ ప్రవీణ్

డీఐజీ కోయ ప్రవీణ్, నంద్యాల ఎస్పీ ఆధిరాజ్‌సింగ్ రాణా వెలుగోడుకు చేరుకుని డప్పు వాయిద్యాల నడుమ వినాయక ఊరేగింపునకు అనుమతించారు. దీంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య వినాయక ఊరేగింపు కొనసాగించి జమ్మినగర్ తండా సమీపంలోని గాలేరు నదిలో నిమజ్జనం చేశారు. ఈ శోభాయాత్రకు వెలుగోడుతో పాటు ఇతర గ్రామాల నుంచి జనం భారీగా తరలివచ్చారు. మొత్తానికి నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో పోలీసులతో పాటు ప్రజలందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఇతర గ్రామాల ట్రాక్టర్ ఇంజన్‌లను..

పోలీసులే స్వయంగా ఇతర గ్రామాల ట్రాక్టర్ ఇంజన్‌లను తెప్పించి ఆయా ట్రాలీల్లోని వినాయక విగ్రహాలను బోయరేవుల సమీపంలోని గాలేరు నదిలో శనివారం తెల్లవారుజామున నిమజ్జనం చేశారు. ఆ తర్వాత ఆ ట్రాక్టర్ల ట్రాలీలన్నీ ఓ ప్రైవేట్ పాఠశాల ప్రాంగణంలో నిలిపివేశారు. ఈ విషయం విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్, వినాయక ఉత్సవ సమితిల దృష్టికి వెళ్లడంతో ఆయా సంఘాల నాయకులు వై.విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రమౌళీశ్వరయ్య, కమ్మయ్య, భూమా రాజశేఖరరెడ్డి, చిలుకూరి శ్రీనివాసులు, నిమ్మకాయల సుధాకర్ ఉదయాన్నే వెలుగోడుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ వినాయక మంటపాల నిర్వాహకులు, ఓ వర్గానికి చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో స్థానిక పోస్టాఫీసు నుంచి పోలీసుస్టేషన్ వరకు భారీ ర్యాలీగా తరలివచ్చారు. సుమారు 11గంటల సమయంలో పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎవరు అడ్డొచ్చినా తాము వినాయక విగ్రహాలకు నిమజ్జనం చేసి తీరుతామని భీష్మించారు. అయితే అనుమతులు ఇచ్చే అంశం తమ పరిధిలో లేదని కలెక్టర్, ఎస్పీలను సంప్రదించాలని స్థానిక పోలీసు అధికారులు వారికి చెప్పడంతో ఆయా సంఘాల ముఖ్య నాయకులు నంద్యాలకు బయలుదేరి వెళ్లారు. అయినప్పటికి ఓ వర్గానికి చెందిన ప్రజలు రాత్రి 7గంటల వరకు స్టేషన్ ఎదుటే ధర్నా కొనసాగించారు. మధ్యాహ్నం అక్కడే భోజనం చేయడంతో పాటు సాయంత్రం వర్షం దంచికొట్టిన అక్కడి నుంచి కదల్లేదు. ఈక్రమంలోనే నిమజ్జనం చేసి తీరుతామంటూ ఓ విగ్రహాన్ని ట్రాక్టర్‌లో పోలీసు స్టేషన్ వద్దకు తీసుకొచ్చారు. బీజేపీ నాయకులు బుడ్డా శ్రీకాంత్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి పోలీసు స్టేషన్ వద్దకు చేరుకుని సమస్య పరిష్కారం కోసం చర్చించారు.



భారీ పోలీసు బందోబస్తు నడుమ నిమజ్జనం

పోలీసుల అత్యుత్సాహంతోనే..



వెలుగోడుకు చేరుకున్న భద్రతా దళాలు

వెలుగోడులో చోటు చేసుకున్న ఉద్రిక్తత పరిస్థితులు పోలీసుల అత్యుత్సాహంతోనే జరిగిందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.విష్ణువర్ధన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం వెలుగోడుకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. చట్టంలో ఎక్కడా ప్రార్థనా మందిరాల వద్ద మేళతాళాలు ఆపాలని లేదన్నారు. హిందూ సమాజం ఇతర మతాలను ఎప్పుడు గౌరవిస్తుందని, వారి ప్రార్థనలు జరుగుతున్నప్పుడు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా గౌరవించే ఆచారాన్ని ఎప్పటికీ ఆచరిస్తామని గుర్తుచేశారు. ఇక్కడ ఇలాంటి ఘటనలు పునరావృతం కావడం సిగ్గుచేటని అన్నారు. వీటిపై ప్రజాప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పోలీసులు కూడా రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు గురికావొద్దని హెచ్చరించారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

- ప్రణాళికతో చదివి విజయం సాధించాలి
- పిల్లల చదువును మధ్యలో ఆపరాదు
- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ
- డీఎస్సీ అభ్యర్థులకు ఘన సన్మానం 7

బకాయిల చెల్లింపులపై విచారణ



విచారణలో పాల్గొన్న అధికారులు

శ్రీశైలం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు ఎంఈవో కార్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న ఐఈఆర్‌టీ (ఇన్‌క్లూజ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్) జ్యోతికి రావాలసిన బకాయిల చెల్లింపులపై అధికారులు విచారణ చేపట్టారు. శనివారం సున్నిపెంటలోని ఆమె స్వగృహానికి వెళ్లి విచారణ జరిపినట్లు నంద్యాల జిల్లా సమగ్ర శిక్ష ఎంఐఎస్ అండ్ ప్లానింగ్ కోఆర్డినేటర్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. జ్యోతి అనారోగ్య కారణాలతో మరణించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎల్‌ఈఎస్ కో ఆర్డినేటర్ ప్రసన్నకుమార్, ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఎంఈవో డి.సక్రునాయక్, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పి.మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళలను పారిశ్రామికవేత్తలుగా మారుస్తాం



డ్వాక్రా మహిళలకు చెక్కును అందిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

- డ్వాక్రా సంఘాలకు బీజం వేసింది సీఎం చంద్రబాబు నాయుడు
- రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి
- రూ.124.29కోట్ల చెక్ పంపిణీ

కొలిమిగుండ్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహిళలను పారిశ్రామిక వేత్తలుగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కొలిమిగుండ్లలోని స్త్రీ శక్తి విజయోత్సవ ర్యాలీలో మహిళలతో కలిసి మంత్రి బీసీ పాల్గొన్నారు. డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి కలిసి డ్వాక్రా సంఘాలతో ప్రత్యేక సమావేశం మంత్రి నిర్వహించారు. ఈసందర్భంగా బనగానపల్లె నియోజకవర్గానికి బ్యాంకు రుణాల ద్వారా మంజూరైన రూ.124.29కోట్ల మెగా చెక్‌ను మహిళా సంఘాలకు మంత్రి బీసీ అందజేశారు. డ్వాక్రా సంఘాలకు బీజం వేసింది సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 30,680 డ్వాక్రా సంఘాలుండగా, 14,080 సంఘాలకు రూ.1,200కోట్లు రుణాలు అందించడానికి ప్రణాళికలు రూపొందించినట్లు మంత్రి వెల్లడించారు. తద్వారా మహిళలకు పెద్ద ఎత్తున ఆర్థిక ప్రయోజనం వనగూరుతుందని అన్నారు. డ్వాక్రా సంఘాలు చంద్రబాబు మానస పుత్రికలని, వారి అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఎంతో తపిస్తున్నారని బీసీ అన్నారు. మరోవైపు పింఛన్లపై ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో తొలగింపు జాబితాలో ఉన్న పింఛన్లు మొత్తం పింఛన్లలో కేవలం ఒక శాతం మాత్రమేనని అన్నారు. పింఛన్లపై మాట్లాడే అర్హత ప్రతిపక్షాలకు లేదని మంత్రి హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ప్రసాదరెడ్డి, టీడీపీ నాయులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, గూలి నాగేశ్వరరెడ్డి, పెట్నికోట హుస్సేన్‌రెడ్డి, రవిప్రకాశ్‌రెడ్డి, వివేకానందరెడ్డి, కామిని క్రిష్ణరంగారెడ్డి, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

రసాభాసగా మున్సిపల్ సమావేశం

- వైసీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం
- టీడీపీ కార్యాలయ అనుమతులకు వాయిదా



పోడియం వద్దకు చేరుకున్న టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు



ఛైర్ పర్సన్ మాబున్నిసా

నంద్యాల టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ సాధారణ సమావేశం శనివారం రసాభాసగా సాగింది. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని హాల్లో ఛైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ముందుగా అజెండాను ప్రవేశపెట్టారు. సభ్యులు కొంత మంది తమ పరిధిలో పనులు కావడం లేదని ప్రశ్నించగా అందుకు ఎంఈ గురప్ప సమాధానం చెప్పారు. టీడీపీ కార్యాలయానికి మూలసాగరంలోని 1.57 ఎకరం భూమిని నిర్మాణానికి ఇవ్వాలని తీర్మాణం ప్రవేశపెట్టారు. దీంతో వైసీపీ కౌన్సిలర్లు గతంలో వైసీపీ కార్యాలయానికి అనుమతులు ఇవ్వకుండా ఇప్పుడు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. దీంతో వెంటనే స్పందించిన ఫ్లోర్ లీడర్ మాబువలి గతంలో ప్రభుత్వంలో ఉండి కూడా అనుమతులు రాలేదంటని, ఇప్పుడు ఇలా టీడీపీ కార్యాలయం నిర్మాణం అడ్డుకోవడం ఏమిటని ఛైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. దీంతో ఇరు పార్టీల కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరిగింది. కొద్దిసేపటికే పోడియం వద్దకు చేరుకుని ఛైర్‌పర్సన్‌తో తప్పనిసరిగా ఆమోదం తెలపాలని కోరారు. దీంతో వైసీపీ నాయకులు కూడా పోడియం వద్దకు చేరుకుని మా కార్యాలయానికి అనుమతులు రాకుండా ఇలా వారికి మాత్రం ఎలా ఇస్తారన్నారు. వాగ్వాదం మధ్యలోనే అజెండాలోని అన్ని అంశాలను పాస్ చేసి ఛైర్‌పర్సన్ వెళ్లిపోయారు. చాలాసేపు సాగి న వాగ్వాదం అనంతరం బిల్లు వాయిదా వేశారు. చా లా మంది కౌన్సిలర్లు వారి సమస్యలు తెలియజేయడానికి వీలు లేకుండా పోయింది. కమిషనర్ బండి శేష న్న, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

శ్రీశైలం డ్యాంకు తగ్గిన వరద

- ఇన్‌ఫ్లో 2,59,558 క్యూసెక్కులు
- ఔట్‌ఫ్లో 1,59,912 క్యూసెక్కులు
- మూడు గేట్లు మూసివేత
- నీటినిల్వ సామర్థ్యం 198 టీఎంసీలు



శ్రీశైలం డ్యాం నుంచి 6గేట్లతో కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. ఎగువ జూరాల స్పిల్‌వే నుంచి 1,70,064 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 32,567 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 56,927 క్యూసెక్కులు, మొత్తం 2,59,558 క్యూసెక్కులు శ్రీశైలం రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లోగా వచ్చి చేరుతుంది. జలాశయానికి వరద తగ్గడంతో రిజర్వాయర్ మూడుగేట్లను మూసివేశారు. శనివారం సాయంత్రం 6గంటల సమయానికి ఆరు గేట్ల నుంచి 1,59,912 క్యూసెక్కులు నీటిని దిగువన సాగర్‌కు పంపుతున్నారు. శ్రీశైలం రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 95,165 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం 881.90 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 198.3623 టీఎంసీలుగా నమోదైంది.

కుప్పం వాసుల కల సాకారం

- హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ నుంచి కృష్ణమ్మ పరుగులు
- నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య



కృష్ణా నదీ జలాలకు జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలోని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గ వాసుల దశాబ్దాల కల సాకారమైందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. నందికొట్కూరు మండలం మల్యాల వద్దగల హంద్రీనీవా సుజల స్రవంతి(హెచ్ఎన్ఎస్ఎస్) ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు కుప్పంకు చేరిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే జయసూర్య నదీజలాలకు పూజలు నిర్వహించి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నలుగురు సీఎంలతో కాని పనిని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసి చూపించారని కొనియాడారు. జూలై నెల 17వ తేదీన సీఎం చంద్రబాబు ఇదే ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారన్నారు. 40 రోజుల్లోనే కుప్పంకు సాగు నీరందించి ఈ ప్రాజెక్టు కలను సాకారాం చేశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ ఛైర్మన్ వీరం ప్రసాదరెడ్డి, సీనియర్ టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, మద్దూరు హరిసర్వోత్తమరెడ్డి, రాష్ట్ర యాదవసంఘం నాయకులు కడియం వెంకటేశ్వర్లు, ఖాతా రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం నడుపుకోవాలి

జేసీ విష్ణుచరణ్

నంద్యాల టౌన్, ఆగస్టు30 (ఆంధ్రజ్యోతి): నూతన బార్ పాలసీ ద్వారా ఎంపికైన బార్ల యజమానులు నిబంధనల ప్రకారం నడుపుకోవాలని జేసీ విష్ణుచరణ్ సూచించారు. శనివారం స్థానిక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక హాల్లో లక్కీడిప్ ద్వారా బార్లను కేటాయించారు. ఈ ప్రక్రియ జిల్లా ఈఎస్ రవికుమార్ అధ్యక్షతన జరిగింది. జేసీతో పాటు అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 19 బార్లకు జనరల్ క్యాటగిరి, రెండు బార్లకు గీత కులాల వారికి కేటాయించినట్లు తెలిపారు. 17బార్లకు జనరల్, 1 గీత కులాల వారికి మాత్రమే లాటరీ ద్వారా లైసెన్స్ దారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. నందికొట్కూరు మున్సిపాలిటీకి రెండు దరఖాస్తులు రాగా డోన్ మున్సిపాలిటీకి ఏవీ రాలేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డిప్ తీయని వారికి వారు చెల్లించిన రుసుం రూ.5లక్షలు వెనక్కి ఇచ్చినట్లు తెలిపారు. వాటికి త్వరలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే నూతనంగా ఎంపికైన లైసెన్స్ దారులు శనివారమే లైసెన్స్ ఫీజులో ఆరో వంతు చెల్లించాలని సూచించారు. అలా చెల్లించకున్నా, సుముఖత చూపకున్నా వారి లైసెన్సను తర్వాత స్థానంలో ఉన్నవారికి కేటాయిస్తామన్నారు. ఒక్క నంద్యాలలోనే 14 బార్లకు 74 దరఖాస్తులు వచ్చినట్లు వారు వివరించారు.

మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లు

- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు
- మొదటి దశలో 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లి సేకరణ 7

తుంగభద్ర తీరం

సాహిత్యం

సమకాలీన రాజకీయాలను చూపే పదవి మూలం ఇదం జగత్

నేడు టీజీవీ కళాక్షేత్రంలో పుస్తక సమీక్ష





కర్నూలు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమకాలీన రాజకీయాలకు, నేతల మనోభావాలకు నిలువుటద్దంగా 'పదవి మూలం ఇదం జగత్' పుస్తకం నిలుస్తుంది. కర్నూలుకు చెందిన సుప్రసిద్ధ నాటక దర్శకుడు, నటుడు, కవి కళారత్న పత్తి ఓబులయ్య 'ధనం మూలం మిదం జగత్తన్న' సూక్తిని, అధికార హోదాను కైవసం చేసుకొని పెత్తనం వెలగబెడుతున్న కొందరు నేతల తీరును అన్వయిస్తూ 'పదవి మూలం.. ఇదం జగత్ పలుకు నిజము' పేరుతో 216 తేటగీతి పద్యాలతో కూడిన పుస్తకాన్ని రచించారు. అధికారం ఉన్నప్పుడు, ఊడిన తర్వాత ఉన్న ఇరు పార్శ్వాలకు ముఖచిత్రం ఇది. సమకాలీన రాజకీయాల్లో అగ్ర రాజ్యాధినేతల నియంత వైఖరిని నిరసించడంలో కూడా ఓబులయ్య పద్యాలను గమనించవచ్చు. కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టే అవినీతిపరుల కన్నా, కోట్లాది ప్రజల అభిమాన ధనాన్ని కొల్లగొట్టే జననేతలకే జనం నిత్యం హారతులు పడతారంటూ 'కోట్లు వెనకేసి నీతికి తూట్లు బొడిచి జైలు పాలైన నేతల చరిత'ను చూడమంటారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజాసేవే ఏకైక మార్గం అన్న సదాభిప్రాయంతో రాసిన ఈ పద్య రచన పత్తి ఓబులయ్య 12వ సృజన. గెలిచిన నేతను భుజాల పైకెత్తి మోసేవారే గానీ, ఓటమితో కుంగిపోయే వాడి భుజం తట్టేవారెవ్వరూ ఉండరన్న వాస్తవాన్ని చిత్రిస్తూ 'ఓడిపోయిన నేతల నాడి తెలిసి ఒంటరితనాన్ని ఓదార్చువారు లేరు.. రాజకీయాల నిజమిది వసుధయందు' అంటారు. మాతృభాషకు పట్టిన దురవస్థను, కరువు కాటకాలతో రాళ్లు దేలిన సీమను సైతం తన పద్యాల్లో రచయిత ప్రస్తావించారు. తెలుగు జాతికి అవిరామసేవలను సల్పిన మహనీయులను తలచుకుంటూ, రాయలవారి మొదలు నందమూరి తారక రాముని వరకు సందర్భసహితంగా కొనియాడారు. ఆదివారం ఉదయం 10 గంటలకు టీజీవీ కళాక్షేత్రంలో పుస్తక సమీక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇది త్వరలో అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో అందుబాటులోకి రానుంది.

కళాకారుల సరికొత్త రికార్డు

- 24 గంటల నిర్విరామ నాటక ప్రదర్శనలు
- ప్రారంభించిన మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్



'పదవి మూలం ఇదం జగత్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీజీ వెంకటేశ్ తదితరులు



పోటీల్లో పాల్గొన్న కళాకారుడు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల తెలుగు భాషా దినోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం నిర్వహించిన ఏకపాత్ర నాటక పోటీలు ఘనంగా ఆరంభమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో సరికొత్త రికార్డు సృష్టించేలా అత్యధికమంది కళాకారులతో 24 గంటల పాటు నిర్విరామ పద్య నాటక పోటీలకు టీజీవీ కళాక్షేత్రం శ్రీకారం చుట్టింది. ఈ పోటీలను శనివారం ఉదయం 10 గంటలకు రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్, ప్రముఖ పారిశ్రామికవేత్త, సినీ నిర్మాత బీవీ రెడ్డి, మాంటిస్సోరి, రవీంద్ర విద్యాసంస్థల అధినేతలు కేఎస్‌వీ రాజశేఖర్, జి.పుల్లయ్య, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు చైర్మన్ వెంకటాచారి ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి గిడుగు రామమూర్తి, తెలుగు తల్లి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ మూడు రోజుల తెలుగు భాషా దినోత్సవాల్లో 24 గంటలపాటు ఏకపాత్ర నాటక పోటీలను నిర్విరామంగా కొనసాగించడం, దాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు వారు నమోదు చేయడం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే ఇదే తొలిసారి అన్నారు. ఇదొక ప్రయోగాత్మక ప్రక్రియ అన్నారు. ఆధునిక కాలంలో రంగస్థల నాటకాలపై ఆదరణ తగ్గిపోతున్న తరుణంలో ఇలాంటి కార్యక్రమాలు కళాకారులకు మరింత ఉత్సాహాన్ని పెంచుతాయని కళాక్షేత్రం నిర్వాహకులను అభినందించారు. 82 మంది కళాకారులు ఇప్పటి వరకు నమోదు చేసుకొని కళాప్రదర్శనలకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తెలుగు నాటక రంగ చరిత్రలో టీజీవీ కళాక్షేత్రం పేరు శాశ్వతంగా నిలిచిపోతుందని ప్రశంసించారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు చైర్మన్ వెంకటాచారి మాట్లాడుతూ కళాకారులు 24 గంటల పాటూ ఏకధాటిగా ఏకపాత్ర నాటక ప్రదర్శనలు చేయడం ఎక్కడా నమోదు కాలేదన్నారు. కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు భోజన సౌకర్యం కల్పించామని, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో నమోదుకు గ్రామీణ ప్రాంత కళాకారులకు చక్కటి అవకాశం లభించినట్లయిందని అన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న కళాకారులను ప్రశంసాపత్రాలు, శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు పి.రాజరత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, మహమ్మద్ మియా, కేవీ రమణ, ఎర్రమ పాండురంగయ్య, గాండ్ల లక్ష్మన్న, సంగా ఆంజనేయులు, కదిరి రమేష్ పాల్గొన్నారు.

పుస్తక ఆవిష్కరణ: టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య రచించిన 'పదవి మూలం ఇదం జగత్' (అధికారము') పుస్తకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆవిష్కరించారు. ప్రతులను ఆయన పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విద్యాసంస్థల అధినేతలు జి. పుల్లయ్య, కేఎస్‌వీ రాజశేఖర్, ఇతర కళాకారులకు అందజేశారు. పదవిలో ఉన్న సమయంలో, ఆ పదవి లేని సమయంలో రాజకీయ నేతల మనోభావాలను చక్కగా తెలియజేశారని పత్తి ఓబులయ్యను ఆయన అభినందించారు.

డీఎంఈగా డాక్టర్ రఘునందన్



కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా డాక్టర్ జి.రఘునందన్‌ను నియమిస్తూ వైద్య ఆరోగ్య అదనపు ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీఎంఈ డాక్టర్ నరసింహం ఈ నెల 31వ తేదీ పదవీ విరమణ పొందనున్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి డీఎంఈగా డా.జి.రఘునంద్‌ను నియమించారు. ఆయన సొంత ఊరు అనంతపురం జిల్లా గుత్తి పట్టణం. 1994 కడపలో సురభీ పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. 1996 ఎస్వీ మెడికల్ కాలేజీ తిరుపతిలో ఆర్థోపెడిక్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 1997 కర్నూలు మెడికల్ కాలేజీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా 2015లో ప్రొఫెసర్‌గా 2021లో కర్నూలు మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2022 అనంతపురం మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్ హెచ్‌వోడీగా, 2022 అక్టోబరులో అనంతపురంలో జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా, 2023 జూలై నుంచి విజయవాడలో అడిషినల్ డీఎంఈగా, వివిధ హోదాల్లో పని చేశారు. ప్రస్తుతం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా నియమితులయ్యారు.

కళ

సైరా శామ్యూల్

పౌరాణికాల్లో రాణిస్తున్న హోంగార్డు



నారద పాత్రలో శామ్యూల్



- రంగస్థల కళా ప్రవీణుడిగా గుర్తింపు
- రెండు నందులతో పాటు అవార్డులెన్నో సొంతం
- పద్యం, నాటకమే ఆయనకు ప్రాణం
- కళారంగంలో చిరుద్యోగి శామ్యూల్ ప్రతిభ

పద్యం తెలుగువారి సొత్తు. పౌరాణిక పద్య నాటకం తెలుగువారి వైభవం. అలాంటి పౌరాణిక పద్య నాటకాన్ని కొత్త ఒరవడితో, నూతన ఆలోచన పోకడలతో ప్రేక్షక జనరంజకంగా ఆడుతూ.. నటుడిగా పాడుతూ నాటక సమాజంలో బహుముఖ పాత్రలు పోషిస్తున్నాడు కర్నూలు నగరానికి చెందిన రెడ్డిపోగు శామ్యూల్. ఓ వైపు పద్య నాటకాలతో పాటు మరో వైపు ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహిస్తూ తనదైన శైలిలో రాణిస్తున్నారు ఆయన. కృషి ఉంటే మనుషులు రుషులు అవుతారన్న నానుడికి ఆయన చక్కని ఉదాహరణగా నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేసే నంది అవార్డు, ఉగాది పురస్కారాలతో పాటు ఎన్నో అవార్డులు, సత్కారాలు ఆయన సొంతమయ్యాయి. ఎన్నో బహుమతులు అందుకున్నా, కీర్తి కిరీటాలు వచ్చినా 'విద్య యొసగును వినయంబు' అన్న రీతిన ఆయన నడుచుకుంటారు. తన మాటల్లోనూ, చేతల్లోనూ అహంభావం, అహంకారం వీసమెత్తు కూడా ప్రదర్శించని ఆయన.. సంస్కారాన్ని ఆభరణంగా మార్చుకుని ఆయన సాంఘిక, పద్యనాటకాల్లో రాణిస్తున్నారు. 'సైరా నరసింహారెడ్డి' నాటకంలో ఆయన పోషించిన పానకాలు పాత్రను చూసిన వీక్షకులకు పూనకాలు రావాల్సిందే. అందుకే ఆయన్ను అందరూ 'సైరా శామ్యూల్' అంటుంటారు.

కర్నూలు కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆయన గొంతు నుంచి జాలువారే పద్యాలు ఆయన ధరించిన పాత్రకే కాదు... ఆ నాటకానికి కూడా వన్నె తెచ్చిపెడతాయి. ఒక నాటకంలో ఆయన వేసే పాత్ర ఏదైనా కావచ్చు, కానీ ఇతర పాత్రలను మించిన గొప్ప నటనతో ఆకట్టుకుంటున్నారు హోంగార్డు ఆర్.శామ్యూల్. సాంఘిక నాటకమైనా, పౌరాణిక నాటకమైనా, తను ధరించే పాత్రలో పరకాయ ప్రవేశం చేసి ప్రేక్షకులను అసాంతం కట్టిపడేసే అభినయం ఆయన సొంతం. జిల్లా నాటక రంగంలో ప్రత్యేకించి నారద పాత్రలో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర, గుర్తింపు తెచ్చుకుంటున్నారు ఆర్.శామ్యూల్. వృత్తిరీత్యా హోంగార్డుగా కర్నూలు యూనిట్‌లో పనిచేస్తున్నా.. ప్రవృత్తి పరంగా సాంఘిక, పౌరాణిక పద్య నాటక కళాకారునిగా రాణిస్తున్నారు. చేసేది చిరుద్యోగమే అయినా, ప్రవృత్తి పరంగా నాటక రంగంలో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. పద్య నాటక రంగానికి పురిటిగడ్డగా నిలిచే కందనవోలులో ఎందరో ఔత్సాహిక యువతకు నాటక రంగంలో మార్గదర్శకంగా నిలుస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే నంది నాటక పోటీల్లో ఇటీవలే రెండు నంది బహుమతులు సాధించిన శామ్యూల్, వివిధ పరిషత్తులు నిర్వహించిన జాతీయ స్థాయి నాటక పోటీల్లోనూ బహుమతులను జిల్లా కళారంగానికి తెచ్చిపెడుతున్నారు.

నంద్యాల జిల్లా మిడుతూరు మండలం తలముడిపి గ్రామానికి చెందిన రెడ్డిపోగు పక్కీరమ్మ, రెడ్డిపోగు నాగన్న కుమారుడు శామ్యూల్ ఇంటర్ వరకు చదువుకున్నారు. 1987లో ఏడో తరగతి చదివే రోజుల్లో మేనమామ ప్రోత్సాహంతో 'పల్నాటి యుద్ధం' బుర్రకథలో కథకుడిగా తొలిసారి రంగస్థలంపై కాలు మోపారు. 1992లో ఇంటర్ సెకండియర్ చదువుతూ ప్రభుత్వం చేపట్టిన 'నిరక్షరాస్యత నిర్మూలన' ప్రచార కార్యక్రమాల్లో విరివిగా పాల్గొన్నారు. సుమారు 30కి పైగా గ్రామాల్లో పర్యటిస్తూ అక్షరాస్యత ఆవశకతపై అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఉన్నత చదువుకు కర్నూలు వచ్చి మేనమామ సుందర్‌రావు ఇంట్లో ఉంటూ, ఆయన ప్రోత్సాహంతో నాటక రంగంపై మమకారం ఏర్పడింది. ఆయన తన ఇంట్లోనే ఒక సంగీత గురువును ఏర్పాటు చేసి, హార్మోనియం వాయిస్తుండగా పద్యాలు ఎలా పాడాలో నేర్పించారు. 1995లో ఏప్రిల్ 24న మేనమామ సుందరరావు కుమార్తె సుభాషిణిని వివాహం చేసుకున్నారు. ఆమె స్టాఫ్ నర్సుగా పనిచేస్తోంది. ఇద్దరు ఆడపిల్లల్లో మహిత ఇంటర్ పూర్తిచేసిన నీట్‌కు సిద్ధం అవుతుండగా, రిషత ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది.



సై సైరా నరసింహారెడ్డి నాటకంలో పానకాలుగా..

మలుపు తిప్పిన ఉద్యోగ జీవితం

2002లో కర్నూలు యూనిట్‌లో హోంగార్డుగా ఉద్యోగానికి శామ్యూల్ ఎంపికయ్యారు. ఒక వైపు ఉద్యోగం చేసుకుంటూనే తీరిక సమయాల్లో పద్య నాటకాలను ప్రదర్శించేవారు. శామ్యూల్‌లోని రంగస్థల నటన ఆసక్తిని గుర్తించిన మామ, విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ బీఆర్ సుందర్‌రావు ప్రోత్సహించారు. అనంతరం టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కళారత్న పురస్కార గ్రహీత పత్తి ఓబులయ్య సహకారం నాటక రంగంలో శామ్యూల్‌కు కీర్తికిరీటాన్ని తెచ్చిపెట్టింది. ఆయన సహకారంతో 2002లో 'శ్రీకృష్ణ తులాభారం' నాటకంలో నారదుడి పాత్రతో తానేంటో నాటక ప్రపంచానికి తెలియజేశారు. 2002లో నాటి జిల్లా పోలీసు అధికారులు ఫ్యాక్షన్ నిర్మూలన, అంధ విశ్వాసాల నిర్మూలనపై 'కనువిప్పు' అనే సాంఘిక నాటకాన్ని గ్రామ గ్రామాన ప్రచారం చేశారు. 2009 వరకు 15 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కూడిన బృందంలో శామ్యూల్ రైతు పాత్రలో ఈ నాటకంలో మెప్పించాడు. 250కి పైగా ఈ నాటకాన్ని గ్రామాల్లో ప్రదర్శించారు.



పోలీసు శాఖ ప్రదర్శించిన కనువిప్పు నాటకంలో రైతు పాత్రలో (మధ్యలో వ్యక్తి)

సొంతమైన అవార్డులు

- 2002లో రాజమండ్రిలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ నంది నాటక పోటీల్లో 'శ్రీకృష్ణాభిమన్యు' నాటకానికి నారద పాత్రకు నంది పురస్కారం.
- 2013లో 'బభ్రువాహన విజయం' నాటకానికి విజయనగరంలో జరిగిన నాటక పోటీల్లో నంది బహుమతి.
- 2014లో 'శ్రీకృష్ణాభిమన్యు' నాటకానికి నారద వేషానికి ప్రత్యేక బహుమతి.
- 2015లో 'శ్రీకృష్ణ కర్ణార్జునీయం' నాటాభిమానానికి ఇంద్రుని పాత్రకు బహుమతి.
- 2016లో 'ప్రమీలార్జున పరిణయం' నాటకానికి ఉత్తమ సహాయనటుడిగా అవార్డు.
- 2017లో 'సై సైరా నరసింహారెడ్డి' చారిత్రక పద్య నాటకంలో పానకాలు పాత్రకు ఉత్తమ సహాయ నటుడి అవార్డు.
- 2018లో ఉగాది పురస్కారం.



మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ, మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం అందుకుంటూ..(ఫైల్)

కళాకారులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కళారంగంలో రాణించే వారు అహర్నిశలు శ్రమిస్తూ తమకు ప్రత్యేక గుర్తింపు రావాలని కోరుకుంటారు. ఇది సహజమే. కానీ అదే సమయంలో తమ వ్యక్తిగత ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అందుకు ఉదాహరణగా నన్ను నేను చెప్పుకుంటాను. 2024 డిసెంబర్‌లో హై బీపీ వల్ల మెదడు రక్తనాళాలు గడకట్టి కోమాలోకి వెళ్లిపోయా. ఆరోగ్యంగా ఉంటే బీపీ, షుగర్ మాత్రలు వేసుకోవాల్సిన అవసరం లేదని ఎవరో ఏదో చెబితే నమ్మి అలసత్వం వహించాను. దానికి పెద్ద సమస్యనే ఎదుర్కోవాల్సి వచ్చింది. బీపీ, షుగర్ ఉంటే కచ్చితంగా మందులు వాడాల్సిందే. అలాగే వైద్యుల పర్యవేక్షణలో వాటిని వేసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలని కోరుకుంటున్నాను. ఆరోగ్యమే మహాభాగ్యం అని పెద్దలు చెప్పిన విషయాన్ని కళాకారులు విస్మరించకూడదు. - ఆర్.శామ్యూల్



నాటి ఎస్పీ ఆకె రవికృష్ణ చేతుల మీదుగా సత్కారం అందుకుంటున్న శామ్యూల్ దంపతులు(ఫైల్)

శ్రీశైలం భద్రతపై ఆక్టోపస్ బృందంతో సమావేశం



నంద్యాల కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానంలో భద్రతాపరమైన అంశాలకు సంబంధించి శనివారం దేవస్థాన కార్యాలయంలో ఆక్టోపస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈవో శ్రీనివాసరావు, ఆక్టోపస్ విభాగం డీఎస్పీలు తిరుపతయ్య, సుంకురయ్య, అధికారులు, స్థానిక తహసీల్దారు శ్రీనివాసులు, సీఐ ప్రసాదరావు, ప్రొటెక్షన్ అధికారులు, అగ్నిమాపక శాఖ అధికారులు, పీహెచ్‌సీ వైద్యాధికారి, విద్యుత్ శాఖ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ దేవస్థానంలో చేపడుతున్న భద్రతా చర్యల గురించి పీపీటీ ద్వారా వివరించారు. అలాగే దేవస్థానంలోని క్యూలైన్లు, క్యూకాంప్లెక్స్, శివరాత్రి, ఉగాది ఉత్సవాలలో ఏర్పాటు చేయనున్న అదనపు క్యూలైన్లు, పార్కింగ్ ప్రదేశాల గురించి వివరించారు. దేవస్థానంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక పోలీస్, సంబంధిత అధికారుల సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఆక్టోపస్ బృందం వారు భద్రతాపరమైన అంశాలకు సంబంధించిన మాక్ డ్రిల్‌ను నిర్వహించారు.

9న జిల్లా స్థాయి మారథాన్

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో ఎయిడ్స్‌పై అవగాహన కోసం సెప్టెంబరు 9న జిల్లాస్థాయి మారథాన్ ద్వారా 5కి.మీ. పరుగు పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ అధికారి డా.శారదాబాయి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టర్ రాజకుమారి అనుమతితో 9వ తేదీ ఉదయం 6 గంటలకు నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఈ పరుగు పోటీ ప్రారంభమవుతుందన్నారు. ఈ పోటీ కళాశాల బ్రిడ్జి వద్ద నుంచి చామకాల్వ, మున్సిపల్ ఆఫీస్, పద్మావతినగర్, టెక్కె మీదుగా జీజీహెచ్ వరకు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డా.వెంకటరమణ తెలిపారు. పోటీలో పాల్గొనే క్రీడాకారులు నంద్యాల జిల్లా వాసులై ఉండాలని, 17నుంచి 25 సంవత్సరాల వయసుగల విద్యార్థినీ, విద్యార్థులు, యువతీయువకులు, పురుషులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు కూడా పాల్గొనవచ్చని వివరించారు. గతంలో జిల్లా స్థాయిలో బహుమతి పొందినవారికి ప్రవేశంలేదన్నారు. పోటీలో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.7వేలు మహిళలు, పురుషులు, ట్రాన్స్‌జెండర్స్ మూడు విభాగాల్లో ఈ బహుమతులు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో కోరారు.

గణనాథుడి వైభోగం

- కొనసాగుతున్న గణేశ్ ఉత్సవాలు
- నేడు పలు ప్రాంతాల్లో నిమజ్జనం



ప్రకాశ్‌నగర్‌లో కొలువైన వినాయకుడు



కర్నూలు కల్చరల్/ నంద్యాల కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా గణేశ్ ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం వినాయక మండపాల్లో స్వామివారి ప్రత్యేక పూజలు అందుకున్నారు. మధ్యాహ్నం పలు వినాయక మండపాల వద్ద భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు నగరంలో రాంబోట్ల దేవాలయం, కుమ్మరి వీధి, చిత్తారివీధి, జమ్మిచెట్టు, అమ్మవారిశాల, పూలబజారు, పాతబస్టాండు, ఎన్‌ఆర్‌పేట, కొత్తపేట, సంకల్‌బాగ్, ధర్మపేట శ్రీనివాసనగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణీయంగా నిలిచాయి. అలాగే మండపాల వద్ద చిన్నారులు పలు దేవతామూర్తుల వేషధారణలో చేసిన నృత్య రూపక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం రాత్రి భజన మండళ్ల ఆధ్వర్యంలో భజలు, భక్తి పాటల కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు నిమజ్జనం : ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లో శనివారం నిమజ్జన వేడుకలు జరగనున్నాయి. నంద్యాలలో ఆదివారం జరిగే నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పర్యవేక్షించారు. నంద్యాల గాంధీ చౌక్‌లో గణేశ్ కేంద్ర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో స్వాగత సభను నిర్వహిస్తున్నట్లల నిర్వాహకులు తెలిపారు. నంద్యాలలోని చిన్న చెరువు కట్ట సమీపంలో ప్రత్యేక పోలీసులతో పాటు బారికేడ్లను ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను మళ్లించారు. నిమజ్జనం కోసం భారీ క్రేన్లను తరలించారు.



సంకల్ భాగ్‌లో కొలువైన గణనాథుడు



ప్రకాశ్‌నగర్‌లో కొలువైన గణనాథుడు



నంద్యాల చెరువుకట్ట వద్ద నిమజ్జనానికి సిద్ధంగా ఉంచిన క్రేన్‌లు

పర్యాటకులకు కనీస వసతులు కల్పించలేరా..

• బెలుం గుహల సిబ్బందిపై మంత్రి బీసీ ఆగ్రహం

కొలిమిగుండ్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన బెలుం గుహల్లో పర్యాటకులకు కనీస వసతులు కల్పించలేరా.. అంటూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బెలుం గుహలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గుహల పరిసరాలు, గుహల ఆవరణంలోని చిరు దుకాణాల్లోని పదార్థాలను మంత్రి పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండటంపై గుహల యూనిట్ మేనేజర్ జి.కిశోర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ, విదేశీ పర్యాటకులు సందర్శించే పర్యాటక కేంద్రం లో పర్యాటకులకు మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారుల బాధ్యత అని గుర్తుచేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సిబ్బంది తమ తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ రమేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న మంత్రి

మహిళ ఆత్మహత్య

దేవనకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లెడుబుడకల గ్రామంలో అత్తింటి వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. సీఐ వంశీనాథ్ తెలిపిన మేరకు.. పెద్దకడుబూరు మండలం జాలవాడికి చెందిన వడ్డె పరమేష్, పద్మ దంపతుల కుమార్తె వడ్డె పద్మ(27)ను, దేవనకొండ మండలం, జిల్లెడుబు డకల గ్రామానికి చెందిన బాలకృష్ణకు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం వివాహం చేశారు. అయితే సంతానం కలగకపోవంతో భర్త కుటుంబ సభ్యులు వేధించేవారు. వీరి వేధింపులు తాళలేక పద్మ శుక్రవారం క్రిమిసంహార మందు తాగింది. ఆమెను కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కోలుకోలేక శనివారం మృతి చెందింది. మృతురాలి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసిన్నట్లు సీఐ తెలిపారు.

ఆటో బోల్తా : వృద్ధురాలి మృతి

బనగానపల్లె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో శివమ్మ (68) దుర్మరణం చెందింది. ఎస్ఐ దుగ్గిరెడ్డి వివరాల మేరకు... జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియానికి చెందిన శివమ్మ, తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనమద్దిలేటి స్వామి దర్శనానికి సొంత ఆటోలో బయలుదేరారు. కటికవాని కుంట వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో శివమ్మ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఆటోలో ఉన్న మరో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

వాగులో పడి యువకుడు..

కోవెలకుంట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లంపాడు, లింగాల గ్రామాల మధ్య ఉన్న చిన్నవంచన వాగులో ఓ యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతిచెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ భూపాలుడు తెలిపిన వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బలరాంపూర్ జిల్లా గొండిపూర్ గ్రామానికి చెందిన లవకుశ, మహమ్మద్ షాకీర్ నంద్యాలలో నివాసం ఉంటూ చిన్నకొప్పెర్ల గ్రామంలో ఓ ఇంటికి పీవోపీ పని చేసేశారు. ఈ మేరకు పది రోజుల నుంచి మోటారు బైకుపై పనికి వచ్చి వెళుతుండేవారు. ఇందులో భాగంగా శనివారం కూడా నంద్యాల నుంచి బైకుపై ఆ ఇద్దరూ వస్తుండగా చిన్నవంచన వాగు వద్ద బైకు అదుపుతప్పి వాగులో పడింది. బైకు వెనుక కూర్చున్న లవకుశ (16) వాగులో పడి గల్లంతయ్యాడు. మహ్మద్ షాకీర్ గ్రామస్థులకు సమాచారం అందించాడు. వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని ఎస్ఐ భూపాలుడు, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డికి సమాచారం ఇచ్చారు. ఎస్ఐ, తహసీల్దారు సంఘటనా స్థలానికి చేరుకుని వాగులో గల్లంతైన యువకుడిని బయటికి తీసేందుకు ఈతగాళ్లను పిలిపించి గాలించారు. లవకుశ మృతదేహాన్ని, బైకును ఈతగాళ్లు బయటికి తీసుకువ చ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

ఉయ్యాలవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన అందనం విజయరాజు(59) చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతిచెందినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఏఎస్ఐ వివరాల మేరకు... కోవెలకుంట్ల పట్టణానికి చెందిన అందనం విజయరాజు ఈ నెల 25న రోడ్డు ప్రమాదం లో గాయపడ్డారన్నారు. కోవెలకుంట్లలోని ఓ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందాడు. భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి..

సంజామల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నుంచి నంద్యాలకు ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ శనివారం తెల్లవారుజామున ప్రమాదానికి గురై డ్రైవర్ మృతి చెందిన సంఘటన పేరుసోమల సమీపంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్ఐ రమణయ్య వివరాలు మేరకు.. కొలిమిగుండ్ల మండలం బందార్లపల్లెకు చెందిన గోగుల సూరీడు (47) తాడిపత్రిలో ట్రాక్టర్‌కు ఇసుక నింపుకొని నంద్యాలకు వెళుతుండగా పేరు సోమల - రెడ్డిపల్లె మధ్యలో అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సూరీడు అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. తన సిబ్బందితో ప్రమాద స్థలాన్ని పరిశీలించామని ఆయన తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ న్నారు. కాగా సూరీడికి ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నట్లు ఆయన వివరించారు.

ఆటో బోల్తా.. ఏడుగురికి గాయాలు

సి.బెళగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఆటో బోల్తా పడి ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం రాత్రి కొత్తకోట విద్యుత్ కార్యాలయం వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కోడుమూరు సుందరయ్యనగర్‌కు చెందిన 13 మంది యువకులు నిమజ్జనం పూర్తయిన సందర్భంగా సుంకేసులకు విందు చేసుకోవడానికి ఆటోలో బయలుదేరి వెళ్లారు. అక్కడ ఫుల్‌గా మద్యం తాగి తిరుగు ప్రయాణం అయ్యారు. కొత్తకోట విద్యుత్ కార్యాలయం దగ్గర రాగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఏడుగురికి గాయాలు కాగా నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. కొత్తకోటకు చెందిన హరి, శ్రీనివాసులు అంబులెన్స్‌కు ఫోన్‌చేసి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

యూరియా పంపిణీలో ఘర్షణ

దొర్నిపాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయంలో శనివారం యూరియా పంపిణీలో ఘర్షణ చోటు చేసుకుంది. కొండాపురం గ్రామానికి 55 యూరియా బస్తాలు మంజూరయ్యాయి. రైతులకు ఒక్కొక్క పాసు పుస్తకానికి రెండు బస్తాల ప్రకారం అందించాల్సి ఉంది. అయితే గ్రామంలో ఓ వ్యక్తికి 10 బస్తాలు అందించారని రైతులు సచివాలయం వద్దకు వచ్చి వీఏఏ ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన సరైన సమాధానం చెప్పకపోవడంతో వీఏఏపై గొడవపడ్డారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే తహసీల్దార్ సుభద్ర, ఎంపీడీవో సావిత్రి, ఏవో ప్రమీల, ఇన్‌చార్జి ఎస్ఐ రామిరెడ్డి సచివాలయం వద్దకు వెళ్లి విచారించారు. అధికారులపై గొడవలకు దిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం


డీఎస్సీ అభ్యర్థులను సన్మానిస్తున్న ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

• ప్రణాళికతో చదివి విజయం సాధించాలి
• పిల్లలు చదువును మధ్యలో ఆపరాదు
• ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ
• డీఎస్సీ అభ్యర్థులకు ఘన సన్మానం

దేవనకొండ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఏ గ్రామం అయినా అభివృద్ధి చెందాలంటే అది చదువుతోనే సాధ్యమని ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ అన్నారు. శనివారం ఆయన కప్పట్రాళ్ల గ్రామానికి వచ్చారు. ముందుగా తానా భవనం నుంచి కల్యాణ మండపం చేరుకొని సమావేశంలో మాట్లాడారు. 2006లో కోల్‌కత్తాలో ప్రైవేట్ జాబ్ చేస్తుండగా తాను ఐపీఎస్ ఎంపికైనట్లు వచ్చిన ఆనందం కంటే, తన దత్తత గ్రామం కప్పట్రాళ్లలో మెగా డీఎస్సీలో ఏడుగురు ఉద్యోగాలు సాధించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. తనకు మొదట బ్యాంకులో క్లర్క్ ఉద్యోగం వచ్చిందని, విధులు నిర్వహిస్తూనే ప్రణాళికతో చదివి విజయం సాధించానన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువు మధ్యలో ఆపకూడదన్నారు. నేడు ఏడుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారని, రాబోయే పదేళ్లలో ఈ సంఖ్య వందకు చేరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా కప్పట్రాళ్ల నుంచి జాతీయ అవార్డులు వస్తాయని ఆశా భావం వ్యక్తం చేశారు.

డీఎస్సీలో ఎంపికైన రామకృష్ణ, శ్రీరాములు, రాజేశ్వరి, రామానాయుడు, రామాంజినేయులు, ఉత్తేజ్‌గౌడ్, శ్రీరాములు 2018 డీఎస్సీ అభ్యర్థులు శ్రీరాములు, బడేసాబ్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. రవికృష్ణ పుట్టిన రోజు సందర్భంగా గ్రామస్థులు ఏర్పాటుచేసిన కేక్‌ను కట్‌చేశారు. వాల్మీకి ఛైర్‌పర్సన్ బొజ్జమ్మ, సర్పంచ్ చెన్నమ నాయుడు, ఎంపీటీసీ సభ్యులు రూపమ్మ, సీఐ వంశీనాథ్, ఏవో అక్బర్, గ్రామస్థులు మల్లికార్జున, చింపి ఈరన్న, ఎల్ఐసీ రాజు, సెక్రటీస్ కోఆర్డినేటర్ నారాయణ పాల్గొన్నారు.

పట్టుదల ఎక్కువ



కప్పట్రాళ్ల గ్రామస్థులకు పట్టుదల ఎక్కువ. అనుకుంటే ఏదైనా సాధిస్తారు. విద్యలో రాణించి, గ్రామానికి మరింతగా మంచి పేరు తీసుకురావాలి. రవికృష్ణ సార్ ప్రోత్సాహంతో మరింత ముందుకు వెళ్తాం. **- రాజేశ్వరి, డీఎస్సీ అభ్యర్థి**

మార్పు మా నుంచే..



గ్రామాభివృద్ధికి మార్పు అనేది మా నుంచే మొదలు కావాలి. రవికృష్ణ సార్ కృషి అభినందనీయం. ఆయన సహకారం మరవలేనిది. గ్రామాభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారు.
-మర్యాద రామకృష్ణ, డీఎస్సీ అభ్యర్థి

రూ.2 లక్షల నగదు అపహరణ

• కేసు నమోదు

కోవెలకుంట్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణంలో ఓ వ్యక్తి తన మోటారు బైకు సైడు బ్యాగులో ఉంచిన రూ. రెండు లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి శనివారం తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఎస్ఐ వివరాల మేరకు..

ఉయ్యాలవాడ మండలం తుడుములదిన్నెకు చెందిన ఉబ్బరి క్రిష్టుడు శుక్రవారం కోవెలకుంట్లకు వచ్చి స్టేట్ బ్యాంకులో బంగారు తాకట్టు పెట్టి రూ.2లక్షలు డబ్బు తీసుకుని మోటారు బైకు సైడ్‌బ్యాగులో పెట్టుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. పట్టణంలో బైకు ఆపి వేరే వారితో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. అనంతరం క్రిష్టుడు ఇంటికెళ్లి చూడగా డబ్బు లేకపోవడంతో పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

• విద్యుదాఘాతంతో యువకుడు మృతి

సి.బెళగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనంలో అపశృతి చోటుచేసుకుంది. విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మీదేవి, రుద్రయ్యకు ఇద్దరు కుమార్తెలు, ఒక్క కుమారుడు చందు(19). శుక్రవారం రాత్రి వినాయక నిమజ్జనానికి వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తుండగా క్రిష్ణదొడ్డి రోడ్డులో వినాయక విగ్రహానికి విద్యుత్ తీగలు తాకి విద్యుదాఘాతానికి గురయ్యాడు. అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యుల అందజేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


చందు(ఫైల్)

గణపతి మండపం దగ్ధం

ఉయ్యాలవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాయలూరు గ్రామం రజకుల వీధిలో ఏర్పాటు చేసిన గణపతి మండపం దగ్ధమైంది. శుక్రవారం సాయంత్రం గణపతి నిమజ్జనం అనంతరం అర్ధ రాత్రి నిప్పు అంటుకొని కాలిపోయింది. అందులో ఎవరూ లేకపోవటంతో ప్రాణాపాయం తప్పింది. అందులో ఉన్న ఫర్నిచర్, స్పీకర్లు, మైకులు, షామియానా తదితర సామగ్రి కాలి బూడిదయ్యాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని స్థానికులు తెలిపారు. కాగా ఇది ప్రమాదవ శాత్తు జరిగిందా.. లేదా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా అన్నది తెలియాల్సి ఉంది.


కాలిపోయిన మండపం

'శుభప్రద'కు వినియోగదారుల కమిషన్ వడ్డింపు

కర్నూలు లీగల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వెంచర్లు వేసి వినియోగదారులకు సేవాలోపం చేసిన శుభప్రద వెంచర్ సంస్థకు జిల్లా వినియోగదారుల కమిషన్ తగిన రీతిలో వడ్డించింది. 2020 జూన్ నెలలో స్థానిక కల్లూరులోని సర్వే.నెంబర్లు 37, 38, 49లో శుభప్రద పేరుతో ఓవెంచర్ వేశారు. ఆవెంచర్‌లో తుగ్గలి మండలం ఆర్ఎస్ గ్రామానికి చెందిన ఫిర్యాది దూదేకుల హుసేన్‌బీతో పాటు మరో 28 మంది రూ.4,85లక్షలు చెల్లించి ప్లాట్లను కొనుగోలు చేశారు. ఈ వెంచర్ వేయకుండే నేషనల్ హైవే ఈ వెంచర్ గుండా చెన్నయ్ సూరత్ గ్రీన్ హైవే చేయడానికి భూసేకరణ ప్రకటన ఇచ్చారు. ఈ భూసేకరణలో బాగంగా శ్రీశుభప్రద వెంచరులోని 60 ప్లాట్లు కూడా పోవడం జరిగింది. అయితే ప్లాట్లు కొనుగోలు చేసినవారికి భూమి కన్వర్షన్ జరగకపోవడంతో ప్రభుత్వం నుంచి నష్టం జరిగింది. దీంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వినియోగదారులు శుభప్రద వెంచర్‌పై ల్యాండ్ కన్వర్షన్ చేయకుండానే కాకుండా ప్లాట్లు వేయడమే కాక వెంచర్‌లో నుంచి హైవే వెళ్తున్న విషయాన్ని కూడా దాచి పెట్టి తమకు సేవాలోపం చేశారని జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కేసు విచారించిన కమిషన్‌ను శుభప్రద వెంచర్‌వారు వినియోగదారులకు సేవా లోపం చేయకుండానే కాకుండా అక్రమంగా వాణిజ్యానికి పాల్పడినట్లు నిర్ధారించింది. దీంతో ఒక్కో ప్లాటు యజమానికి రూ.2లక్షల చొప్పున నష్టపరిహారంతో పాటు కోర్టు ఖర్చుల కింద అదనంగా మరో రూ.5వేలను ఫిర్యాదుదారులకు 45 రోజుల లోపు చెల్లించాలంటూ జిల్లా వినియోగదారుల కమిషన్ ఛైర్మన్ కరణం కిషోర్‌కుమార్, సభ్యులు ఆదేశాలు జారీ చేశారు.

నేడు విద్యుత్ బిల్లు కేంద్రాల్లో సేవలు

కల్లూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం విద్యుత్ బిల్లు చెల్లింపు కేంద్రాలు పనిచేస్తాయని ఆశాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఆదివారం తమ సమీపంలోని విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాల్లో సేవలు యథావిధిగా పనిచేస్తాయని, విద్యుత్ వినియోగదారులు కరెంట్ బిల్లులు చెల్లించాలని సూచించారు.

అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలి

• యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ


మాట్లాడుతున్న సుబ్బారావమ్మ

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావమ్మ పిలుపునిచ్చారు. శనివారం కేకే భవన్‌లో ఆ యూనియన్ జిల్లా స్థాయి వర్క్‌షాపు జిల్లా అధ్యక్షురాలు బి.రేణుక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావమ్మ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో 42 రోజులు సమ్మె చేసినా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా, విన్నపాలు అందజేసినా పరిష్కరించడం లేదన్నారు. పనిభారానికి కారణమైన యాప్‌లను రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. హక్కులను సాధించుకునేందుకు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా నాయకురాళ్లు బాలదుర్గమ్మ, శైలజ, ప్రభావతమ్మ, వరలక్ష్మి, పద్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డీఎస్సీ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన


శిబిరాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా ఇటీవల ఎంపికైన దివ్యాంగ అభ్యర్థులకు శనివారం కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)లో సర్టిఫికెట్లను వైద్యులు పరిశీలించారు. కడప, అనంతపురం, కర్నూలు జిల్లాలకు చెందిన వారు ఈ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. ఈఎన్‌టీలో అనంతపురం జిల్లా నుంచి ఆరుగురు, కర్నూలు జిల్లా నుంచి 18 మంది, కడప జిల్లా నుంచి 13 మందికి ఈఎన్‌టీ వైద్యులు రీవెరిఫికేషన్ చేశారు. ఇక ఆర్థోపెడిక్‌లో లాకోమేటర్ కింద కర్నూలు జిల్లాలో 28 మందికి మానసిక విభాగంలో కర్నూలు జిల్లాలో 1, అనంతపురంలో నలుగురికి వైద్యులు ఎంపికైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు పరిశీలించారు.


శ్రీమఠంలో కర్ణాటక హైకోర్టు జడ్జి

మంత్రాలయం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం కర్ణాటక రాష్ట్ర జడ్జి జస్టిస్ ఇంద్రేష్ శనివారం రాత్రి స్వామివారిని దర్శించుకున్నారు. మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాస రావు, శ్రీపతి ఆచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు. అనంతపురాణిక్, మల్లిఖార్జున స్వామి, అనంతస్వామి, పవన్‌ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్ ఉన్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోళ్లు


కోడుమూరు మండలం వర్కూరులో పొలంలోనే ఉల్లి పంట

• హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు
• మొదటి దశలో 5వేల మెట్రిక్ టన్నుల ఉల్లి సేకరణ



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఉల్లి రైతుల కన్నీళ్లు తుడిచేందుకు తీసుకున్న నిర్ణయం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా గ్రామాల్లోనే రైతుల నుంచి ఉల్లి కొనుగోళ్లను చేపట్టేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్లు మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారులకు సమాచారం అందింది. దీంతో మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి నారాయణమూర్తి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజుతో కలిసి శనివారం కర్నూలు జిల్లాలోని పత్తికొండ, కోడుమూరు, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లోని ఉల్లి పండించిన గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. క్వింటం ఉల్లికి గిట్టుబాటు ధర రూ.1,200 అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో దాదాపు 5వేల మెట్రిక్ టన్నులు సేకరించాలని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని నిల్వ చేసేందుకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాములతో పాటు మార్కెట్ కమిటీ యార్డుల పరిధిలోని గోదాములను సిద్ధం చేస్తున్నారు. ఉల్లి పంటను నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తామని మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

ముంచిన వాన

- పొంగి పొర్లుతున్న వాగులు
- చెరువులను తలపిస్తున్న పొలాలు
- వేల ఎకరాల్లో పంటలు నష్టం
- భవనాశి నీటిని మళ్లించకపోతే ఏటా నష్టాలే


దెబ్బతిన్న మొక్కజొన్న పంట


చెరువును తలపిస్తున్న పొలాలు

పాములపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో గత పది రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పంట పొలాలు చెరువులను తల పిస్తున్నాయి. మండలంలో చెలిమిల్ల, ఇస్కాల, పాములపాడు కంబాలపల్లి గ్రామాల్లో గ్రామ శివార్లలోని భవనాశి వాగు తుఫాన్‌ల కారణంగా పొంగి ప్రవహిస్తుంది. దీంతో సమీప పంట పొలా ల్లోకి వరద చేరి దాదాపు 2,500 ఎకరాలకు పైగా నీట మునిగింది. 90 శాతం మొక్కజొన్న, పది శాతం పత్తి, వరి, సోయాబీన్ పం టలు నీటముని గాయి. ఎకరాకు రూ.30 ఖర్చు చేశారు.

నిండుకుండలా శివభాష్యం సాగర్ ప్రాజెక్టు

ఎగువ నల్లమల అటవీ ప్రాంతం లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఉప్పొంగుతున్న భవనాశి వాగు, మరోవైపు శివభాష్యం సాగర్ ప్రాజెక్టు నిండుకుండల మారింది. అధికారులు గేట్లు ఎత్త డంతో నీరు గత 15 రోజులుగా దిగువకు పరవళ్లు తొక్కడం, ఈ రెండు కలసి పొలాలను ముంచె త్తింది. దీంతో పంట పూర్తిగా నీట మునిగింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఇస్కాల గ్రామ శివార్లలోని భవనాశివాగుకు గండితీసి సమీపంలో గల తెలుగుగంగ లోకి నీటిని మళ్లిస్తే రైతులకు మేలు జరుగుతుందని, లేకపోతే ఏటా పంటపొలాలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతు న్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తొమ్మిది లక్షలు నష్టపోయా



ఈ ఏడాది ఖరీఫ్‌లో రూ. 9 లక్షల పెట్టుబడులు పెట్టి 30 ఎకరాలలో మొక్కజొన్న పంటసాగుచేశాను. అధిక వర్షాల కారణంగా పంటల్లోకి వర్షపునీరు చేరి పంటలు పూర్తిగా దెబ్బతింది. దీంతో తీవ్రంగా నష్టపోయా.

- కోట్ల నాగేశ్వరరెడ్డి, రైతు, పాములపాడు

పంటలు నాశనం



ఐదు ఎకరాలలో మొక్క జొన్న పంట సాగుచేశా. ఇటి వల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పొలాల్లోకి నీరు చేరింది. దీంతో పంటలు దెబ్బతిన్నాయి. దాదాపు రూ.1.50వేలు నష్టం నష్టం వాటిల్లింది.

- నాగిరెడ్డి, రైతు, జూటూరు

ఉద్యాన పంటలను పెంచండి


సిబ్బందితో మాట్లాడుతున్న భాస్కర్‌నాయుడు

మిడుతూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉద్యాన పంటలను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఉద్యానవన అధికారి భాస్కర్ నాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయాన్ని భాస్కర్ నాయుడు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో మండలంలో పర్యటించి రైతు లతో మాట్లాడి ఉద్యానవన పంటలు ఏర్పాటు చేసేందుకు కృషిచేయా లని సూచించారు. గ్రామాల్లో కంపోస్టు పిట్లు, గోకులం షెడ్లు ఏర్పాటు చేయించాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సురేష్, ఈసీ షబాన, టీఏలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలి


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్

నంద్యాల రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర,రాష్ట్ర ప్రభు త్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉధృ తం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్ కుమార్ పిలుపుని చ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన కమిటీ సభ్యుల సమావే శంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ పీఎం అయిన తర్వాత కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. సీఎం చంద్ర బాబు విద్యుత్ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారాన్ని పెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రుడు, సీనియర్ నాయకులు తోట మద్దులు, జిల్లా నాయకులు రత్నమయ్య, పుల్ల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' బకాయిలను వెంటనే చెల్లించాలి

నంద్యాల రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు గత 15 వారాలుగా రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీ వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ కోరారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. దేశ వ్యాప్తంగా వామపక్షాల పోరాటంతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్లో రూ.4,60,000 కోట్లు కేటాయిం చాల్సి ఉండగా కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమే కేటాయించింద న్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణ, ఎస్.బాబా ఫక్రుద్దీన్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

పగిడ్యాల: పాలక ప్రభుత్వాలు అనుసరిస్తూన్న ప్రజా వ్యతిరేక విధాన లకు నిరసనగా కార్మికులు ఉద్యమాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసురత్నం పిలుపునిచ్చారు. పగిడ్యాలలోని మండల సమాఖ్య కార్యాలయంలో సీఐటీయూ మండల మహాసభలను శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నిక లలో ఇచ్చిన హామీలను కాలరాస్తున్నాయని వారు ఆరోపించారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్‌కోడ్ చట్టాలను అమలు చేసి కార్మికుల హక్కులను నిర్వీర్యం చేయడం తగదన్నారు. అనతరం సీఐటీయూ నూతన మండల కమిటీని ఎనుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పక్కీర్‌సాహెబ్, బాబు, సాజీదాబేగం, వరలక్ష్మీ, భారతి,ప్రబా వతి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సార్బీసీ ఏఈ గుండెపోటుతో మృతి


చంద్రుడు(ఫైల్)

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాల హౌసింగ్‌బోర్డు కాల నీలో నివాసమున్న పాణ్యం ఎస్సార్బీసీ ఏఈ చంద్రుడు శనివారం గుండెపోటుతో మృతిచెం దారు. శుక్రవారం సాయంత్రం తీవ్ర అస్వస్థ తకు గురికావడంతో కుటుంబసభ్యులు స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొం దుతూ శనివారం సాయంత్రం మృతిచెం దారు. చంద్రుడు మృతిపట్ల జలవనరుల శాఖ ఈఈ ప్రతాప్ విచారం వ్యక్తం చేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సాను భూతిని వ్యక్తం చేశారు.

టీడీపీ నాయకుడి మృతి


ఎల్లారెడ్డి మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బుడ్డారాజశేఖర రెడ్డి

ఆత్మకూరు రూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండలంలోని సిద్ధపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సింగారెడ్డి ఎల్లారెడ్డి(76) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి శని వారం గ్రామానికి చేరు కుని మృతుడు ఎల్లారెడ్డి కుటుంబాన్ని పరామర్శిం చారు. అనంతరం ఎల్లా రెడ్డి మృతదేహానికి పూల మాలలు సమర్పించి నివాళి అర్పించారు. కుటంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయన వెంట టీడీపీ నాయకులు సింగారెడ్డి గంగాధరరెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షులు వేణు గోపాల్ అబ్దుల్లాపురం భాష, సంజీవరెడ్డి,రమ ణారెడ్డి,లింగారెడ్డి ఉన్నారు.

టీడీపీది చేతల ప్రభుత్వం : గౌరు చరిత


పొదుపు మహిళలకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

పాణ్యం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శనివారం పాణ్యం మార్కెట్ యార్డులో సూపర్‌సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్త్రీశక్తి బహిరంగ సభకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమానికి ముందు బస్టాండు నుంచి బహిరంగ సభ వరకు స్త్రీశక్తి ర్యాలీ నిర్వహించా రు. ఆమె మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం మొదటి నుంచి మహిళాభ్యు దయం కోసం కృషి చేస్తుందన్నారు. సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా ఈనెల 15న మహిళలకు ఉచిత ప్రయాణం వాగ్దానం నెరవేర్చిందన్నారు. ఈ హామీతో ప్రభుత్వంపై 1900ల కోట్ల భారంపడుతుందన్నారు. ప్రతి రోజూ లక్ష మంది మహిళలు ఉచితంగా యాణిస్తున్నారన్నారు. పొదుపు మహిళల అభివృద్ధి కోసం టీడీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. పింఛన్లు తొల గించిన అర్హులకు తిరిగి పింఛన్ అందేలా చర్యలు చేపడతామన్నారు. తల్లికి వందనంతో కుటుంబంలోని అందరు విద్యార్థులకు ఆర్థిక సాయం అందు తుందన్నారు. ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇచ్చి మహిళలకు మరింత ప్రోత్సాహం అందించిందన్నారు. చంద్రబాబు 14 యేళ్ల పాలనలో 13 సార్లు డీఎస్సీ విడుదల చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. గోరు కల్లు రిజర్వాయర్ రిపేరీలకు రూ. 58 కోట్లు మంజూరు చేసినట్లు తెలి పారు. తమ్మరాజుపల్లె యేటిపాయ చెక్‌డ్యాంను గత పాణ్యం నాయకులు పట్టించుకోకపోవడంతో ముఖ్యమంత్రితో చర్చించి చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.కోటి 35 లక్షలు మంజూరు చేయించామన్నారు. గత పాలనలో ప్రజ లను మభ్యపెడుతూ నాయకులు జేబులు నింపుకోవడానికే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపించారు. మహిళా సమాఖ్య సభ్యులకు రూ. 5.75 కోట్ల చెక్కును అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పాణ్యం నుంచి సుగాలిమెట్ట వరకు మహిళ లతో పాటు ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ కార్యక్ర మంలో టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్, డీపీఓ లలితాబాయి, తహశీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ ప్రసాదు, గడివేముల ఏపీఎం జ్యోతి, సీఐ కిరణ్‌కుమార్ , ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి,ఎంపీటీసీలు రంగరమేష్, భాస్కరరెడ్డి, బీజేపీ, జనసేన నాయకులు రాజశేఖర్, జగదీశ్, మార్కెట్ యార్డు ఛైర్మన్ గీత, మండల పొదుపులక్ష్మీ సంఘం అధ్యక్షురాలు రామలక్ష్మమ్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిక ప్రక్రియ వాయిదా

నందికొట్కూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు బార్ అండ్ రెస్టారెంట్‌కు నాలుగు దరఖాస్తులు రావాల్సి ఉండగా రెండు దరఖాస్తులు రావడంతో లైసెన్సుదారుల ఎంపిక ప్రక్రియ చేయ లేదని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్‌శాఖ సీఐ రామాంజనేయులు తెలి పారు. జిల్లాలో జనరల్ కేటగిరి కింద 19 బార్లు, గీతకులాల వారికి రెండు బార్లు కేటాయించారన్నారు. అయితే ఇందులో జనరల్ కేటగిరి కింద 17 బార్లు, గీతకులాల వారికి కేటాయించిన ఒక బార్‌కు నిబంధ నల ప్రకారం నాలుగు లేదా అంతకంటే ఎక్కువ దరఖాస్తులు రాగా వాటికి శనివారం లాటరీ పద్ధతిన కలెక్టర్ కార్యాలయంలో లైసెన్సులు కేటాయించారన్నారు. కాగా నందికొట్కూరు మున్సిపాల్టీలో బార్‌కు రెండు దరఖాస్తులు రాగా నిబంధనల ప్రకారం లాటరీ పద్ధతి ద్వారా లైసెన్సుదారుల ఎంపిక ప్రక్రియ చేయలేదన్నారు. అయితే ఈ బార్‌ను దక్కించుకోవాలనుకునే ఔత్సాహికులు ఎవరైనా నిబంధనల ప్రకారం నందికొట్కూరు మున్సిపాల్టీ జనరల్ కేటగిరి బార్‌కు దరఖాస్తులు చేసు కోవచ్చాన్నారు. కాబట్టి దరఖాస్తులు సమర్పించే వారు సెప్టెంబరు 1వ తేదీ సాయం త్రం 6 గంటల్లోపు దరఖాస్తులు సమర్పించవచ్చన్నారు. 2వ తేదీన ఉదయం 8గంటలకు లాటరీ పద్ధతిన నంద్యాల కలెక్టర్ ఆఫీ సులో లైసెన్సుదారుడి ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు.

పట్టుదల, సాధన ఎంతో ముఖ్యం


ఉద్యోగం సాధించిన వారితో ప్రతిభా డైరెక్టర్ ఉషారాణి

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యా ర్థులు అనుకున్న లక్ష్యా లను సాధించేందుకు పట్టుదల, సాధన ఎంతో ముఖ్యమని ప్రతిభా కోచింగ్ సెంటర్ డైరక్టర్ ఉషా రాణి అన్నారు. తమ కోచింగ్ సెంటర్‌లో చదివి డీఎస్సీతో ఉద్యో గాలు సాధించిన వారిని శనివారం డైర క్టర్ అభినందించారు. ఎస్ఏ గణితం విభాగంలో ఇంద్రాణి, ఎస్ఏ సోష ల్‌లో శ్రీనివాసులు, ఎస్జీటీగా రెహనాతో పాటు ఆరుగురు డీఎస్సీలో ఉద్యోగాలు సాధించినట్లు ఆమె తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న మధుసూదన్‌రెడ్డి

బండి ఆత్మకూరు ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏ కోడూరు గ్రామానికి చెందిన మృతుడు పబ్బతి వెంకటన్న భార్య వేదమ్మకు టీడీపీ నాయకుడు వడ్డు మధుసూదన్‌రెడ్డి రూ.5 వేల నగదు అందజేశారు. అలాగే మృతుడి భార్యకు వితం తు పింఛన్ మంజూరు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు: కలెక్టర్



ఫొటోగ్రాఫర్ దంపతులకు నంది విగ్రహాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాజకుమారి, జేసీ విష్ణుచరణ్

నంద్యాల ఎడ్యుకేషన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పదని, విధి నిర్వహణలో ఫొటోగ్రాఫర్ ఆంజనేయులు ఎంతో అంకితభావంతో పనిచేశారని కలెక్టర్ రాజకుమారి కొనియాడారు. సమాచార పౌరసంబంధాల శాఖలో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఆంజనేయులును శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజకు మారి, జేసీ విష్ణుచరణ్ ఘనంగా సత్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆంజ నేయులు సమాచార శాఖలో ఎంతో బాధ్యతగా, నిబద్ధతతో విధులు నిర్వ హించారని, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు విధిగా ఫొటో కవరేజి చేసి సక్రమంగా విధులు నిర్వహించారంటూ అభినందించారు. డీఐపీఆర్‌వో సిహెచ్ పురుషోత్తం మాట్లాడుతూ ఫొటోగ్రాఫర్ ఆంజనేయులు సమాచారశాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో 32 యేళ్ల పనిచేశారని, ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఎంతో చాకచక్యంగా ప్రముఖుల ఫొటోలు తీసి శాఖ గుర్తింపు తెచ్చారని కొనియాడారు. అనంతరం కలెక్టర్, జేసీ ఆంజ నేయులు దంపతులకు పట్టువస్త్రాలు, జిల్లాకు ప్రతీకగా నిలిచే నందివిగ్ర హాన్ని అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో రామునాయక్, కలె క్టర్ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి



ఆత్మకూరులో క్రీడా ర్యాలీని నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): క్రీడలపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని రైల్వే వాలీబాల్ కోచ్ నిమ్మి కృష్ణయాదవ్, టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి నాగూర్‌ఖాన్, సింగిల్ విండో సొసైటీ ఛైర్మన్ షహ బుద్దిన్, స్పోర్ట్స్ క్లబ్ ఛైర్మన్ పస్పేల్ మున్నా పేర్కొన్నారు. ఈ నెల 29న హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఆత్మకూరు పట్టణంలో విద్యార్థులతో కలిసి భారీ జాతీయ పతాకంతో ర్యాలీని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ధ్యాన్‌చంద్‌ను క్రీడాకారులు ఆద ర్శంగా తీసుకుని ఆటల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు రవీంద్రబాబు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా పురం బాషా, పాఠశాల హెచ్‌ఎం షాబుద్దిన్, స్టేడియం ఇన్‌చార్జ్ జునైద్, నాయకులు మోహబతుల్లా, ఆసీఫ్ బేగ్, సాధిక్ తదితరులు ఉన్నారు.

కొత్తరామాపురంలో చికెన్ గున్యా

- అప్రమత్తమైన అధికారులు


వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

ఆత్మకూరురూరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మండలం కొత్తరామాపురం గ్రామంలో చికెన్ గున్యా ప్రబలింది. గ్రామంలో ఒక కేసు నమోదు కావడంతో బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు అప్రమత్తమయ్యారు. శనివారం గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టడంతో పాటు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పవన్‌కుమా ర్ ఆధ్వర్యంలో గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.అలాగే ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర అనుమానితులకు రక్త పరీక్షలు నిర్వహిం చారు.అలాగే ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించి, తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేయిం చారు.అలాగే రోడ్లపై నిలిచిన నీటిని తొల గించి అబేట్ ద్రావణాన్ని పిచికారి చేయిం చారు.మలేరియా, డెంగ్యూ,చికెన్‌గున్యా ప్రబ లకుండా ప్రజలు దోమతెరలు వాడాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఖుద్దూస్‌బాషా, ఫాతి మా,ఎంపిహెచ్ఎ భాస్కర్,కిరణ్మయి పాల్గొ న్నారు.

ఉపకారాగారం తనిఖీ



నందికొట్కూరు సబ్ జైలులో ఖైదీతో మాట్లాడుతున్న న్యాయాధికారి

నందికొట్కూరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఉపకారాగారాన్ని న్యాయాధికారి శోభారాణి అకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. కారాగారంలోని ఖైదీలతో మాట్లాడుతూ జైలులో అన్ని సౌకర్యాలు లభిస్తున్నాయా? లేదా? అని ఆరా తీశా రు. అందరికీ న్యాయవాది ఉన్నారా, 70 సంవత్సరాలు పైబడిన వృద్ధు లకు ఆరోగ్య పరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం జైలులోని ఉచిత న్యాయసేవా కేంద్రాన్ని సంప్రదించవచ్చన్నారు. ఆన్‌లైన్ నెంబర్ 15100 ద్వారా కూడా సేవలను పొందవచ్చన్నారు. భోజన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ రఘునా థ్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం


నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయక ప్రతిమలు

గడివేముల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం వినాయక నిమజ్జనాన్ని ప్రజలు వైభవంగా నిర్వహించు కున్నారు. భారీగా వర్షంలోనే గణనాథులను మేళతాళాల మధ్య గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లు కుంటూ కేరింతలు కొట్టారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుం డా ఎస్ఐ నాగార్జునరెడ్డి ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కరకట్ట నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి

గడివేముల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అలగనూరు రిజర్వా యర్ కరకట్ట నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలనీ సీపీఐ (ఎంఎల్)లి బరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా షేక్.అబ్దుల్‌సలామ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అలగనూరు రిజర్వాయర్ కరకట్ట దెబ్బతిన్న పట్టించుకోలేదని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.32 కోట్లు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చిన ఇప్పటి వరకు నిధులు మంజూరు చేయలేదని అన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, నరసింహులు, రసూల్ పాల్గొన్నారు.

కౌన్సిల్ సభలో నాలుగు తీర్మానాలకు ఆమోదం

ఆత్మకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సి పల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియా అధ్యక్ష తన శనివారం జరిగిన కౌన్సిల్ సభలో నాలుగు తీర్మానాలు ఆమో దించారు. ఇందులో ప్రధానంగా 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన రూ.72.97లక్షల నిధులతో 7 సీసీ వర్క్‌లు, డ్రైనేజీలకు సంబంధించిన తీర్మానాన్ని ఆమోదించారు. ఆత్మకూరు మున్సిపా లిటీ పరిధిలో ఇంటి పన్నుల యందు డోర్ నంబర్ లేదా ఓనర్ పేరు, కాలనీ పేరు ఏవైనా తప్పులు ఉన్నట్లయితే ఈపీఆర్ ద్వారా సరిచేసుకొనుటకు అనుమతులు రావడంతో ఈ తీర్మానాన్ని సభ్యుల ముందు తీసుకురాగా ఇందుకు అంగీకరించారు. అలాగే మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న పరదాని శ్రీనివాసులు అనే వర్కర్ అనారోగ్యంతో మరణించడంతో ఆయన స్థానంలో అతని కుమార్తె లక్ష్మీప్రసన్నకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇచ్చేందుకు కౌన్సిల్ ఆమోదించారు. అదేవిధంగా మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ ప్రతినిధి అయిన అడ్వకేట్ సుబ్రమణ్యంకు బకాయి ఉన్న 72 నెలల గౌరవ వేతనం రూ.10.80లక్షలను చెల్లిం చేందుకు పాలకవర్గం ఆమోదించడం జరిగింది. ఈ సమావేశంలో కమిషనర్ రమేష్‌బాబు ఉన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పెద్దయమ్మనూరు, దొర్నిపాడు పీహెచ్‌సీలను డీఎంహెచ్‌వో డా.ఆ ర్.వెంకటరమణ తనిఖీ చేశారు. ఆయా ఆరోగ్యకేంద్రాల్లో ఓపీ విభాగాలను, అక్కడున్న రోగులను వారికి అందేసేవలపై ఆరాతీ శారు. అలాగే ఓపీ విభాగంలోని రికార్డులను పరిశీలించారు. పీహె చ్‌సీల్లో జాతీయ ఆరోగ్య, కుటుంబసంక్షేమ కార్యక్రమాల ఐఈసీ మెటీరియల్ ప్రదర్శనను అవగాహన కొరకు ప్రజలు, రోగులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

మహానందిలో భారీ వర్షం


కొనేరులో చేరిన వర్షపునీరు

మహానంది, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలంలో శనివారం రాత్రి రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామాల్లోని పలు కాల నీలు జలమయం అయ్యాయి. కుండపోతగా కురిసిన వర్షంతో మహానంది క్షేత్రంలోని అద్భుత జలసంపద అయిన నీరు వరద నీటి ప్రవాహం కొనేర్లల్లో చేరినా రంగు మాత్రం మారలేదు. అలాగే తెల్లగానే నీరు ఉండడంతో భక్తులు ఆశ్చర్యపోయారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

- వైభవంగా కొనసాగుతున్న ఉత్సవాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- నేడు పలు చోట్ల నిమజ్జనాలు

చాగలమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలో వినాయకచవితి పండుగ సందర్భంగా పలు వీధుల్లో కొలువుదీరిన వినాయకులకు నాలుగో రోజు శనివారం ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. చెన్నకేశవ ఆలయంలో కొలువుదీరిన వినాయకుడికి పీఆర్టీయూ సంఘ నాయకులు రవీంద్రారెడ్డి, సురేష్ బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కోటగడ్డ వీధిలో రజక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మౌలాలి ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశా రు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు, టీడీపీ నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. చాగలమర్రి గ్రామంలో గోవిందనామాలతో రూపొందించిన వినాయకుడు, ఛత్రపతి శివాజీ అలంకరణలోని వినాయకుడి ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

రుద్రవరం : మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన గణనాథుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. 11వ రోజు నిమజ్జనం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

డోన్ రూరల్: పట్టణంలోని కొండపేట, పాతపేట తారక రామ నగర్, శ్రీనివాస్ నగర్, నెహ్రూ కాలనీ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల మండపాల వద్ద జై భోలో గణేష్ మహారాజ్‌కు జై అంటూ భక్తులు సందడి చేశారు. మండపాలలో జరుగుతున్న ప్రత్యేక పూజలు చేశారు. ఆయా మండపాల వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం నర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణంలో గణేశ్ నిమజ్జన కార్యక్రమాన్ని ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. పట్టణ సమీపంలో వెంకటాపురం చెరువులో విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్‌బాబు, పోలీసు సిబ్బంది పర్యవేక్షణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచే గణేశ్ విగ్రహాల తరలింపునకు చర్యలు తీసుకుంటున్నారు.


చాగలమర్రిలో వినాయకుడిని పూజిస్తున్న మహిళలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

డోన్ పట్టణంలోని గణేశ్ మండపాల వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పట్టణంలోని ప్రజా వైద్యశాల వీధిలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శివతాండవం నృత్యప్రదర్శన, మంజునాథ నాటకంలో చిన్నారులు ప్రదర్శించిన నాటకాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలను ప్లాస్టిక్ రహితంగా జరుపుకోవాలి

బనగానపల్లె: పట్టణంలో ప్రజలు గణేశ్ ఉత్సవాలను ప్లాస్టిక్ రహితంగా జరుపుకోవాలని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ కోరారు. శనివారం బనగానపల్లె పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించి గణేశ్ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టంగుటూరు శ్రీనయ్య, అల్లి హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

- బనగానపల్లె పట్టణంలో ఆదివారం గణేశ్ నిమజ్జన వేడుకలు ఆదివారం నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10గంటలనుంచి గణేశ్ విగ్రహాల ఉత్సవ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ పోలీస్‌బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. టంగుటూరు రహదారిలోని కైప చెరువులో గణేశ్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నట్లు కేంద్ర గణేశ్ ఉత్సవ కమిటీ ప్రధాన సలహాదారు, అధ్యక్షుడు మల్లారెడ్డి తదితరుల పాల్గొన్నారు.

గణేశుడికి డీఎస్పీ ప్రత్యేక పూజలు

ఆళ్లగడ్డ: పట్టణంలోని సత్రం వీధిలో ఏర్పాటు చేసిన మహాగణపతికి డీఎస్పీ ప్రమోద్, టౌన్ సీఐ యుగంధర్ ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు బాలసుబ్రమణ్యశర్మ వినాయక విగ్రహానికి పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు డీఎస్పీ, సీఐలను సత్కరించారు. పట్టణంలో ఏర్పాటుచేసిన వినాయకులను ఆదివారం నిమజ్జనానికి తరలించనున్నారు. ఏర్పాట్లను పడకండ్ల సమీపంలోని బ్రిడ్జి వద్ద మున్సిపల్ కమిషనర్ కిశోర్, తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపీడీవో నూర్జహాన్, టౌన్ సీఐ యుగంధర్ పరిశీలించారు.


రుద్రవరం: వాసాపురంలో గణనాథుడికి పూజలు చేస్తున్న భక్తులు


చాగలమర్రిలో వినాయకుడికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు


బనగానపల్లెలో వినాయకుడి వద్ద పూజలు చేస్తున్న బీసీ ఇందిరమ్మ


ఆళ్లగడ్డలో పూజలు చేస్తున్న డీఎస్పీ ప్రమోద్, సీఐ యుగంధర్


డోన్‌లో వినాయక మండపం వద్ద చిన్నారుల నృత్యప్రదర్శన

అహోబిలంలో భారీ వర్షం


రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షం నీరు

ఆళ్లగడ్డ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో దొరకొట్టాల రోడ్డులోని డ్రైనేజీలు పొంగిప్రవహించాయి. పంచాయతీ కార్మికులు మురుగు కాల్వలను శుభ్రం చేయకపోవడం తో వర్షం నీరు ఇళ్లలోకి చేరిందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగుకాల్వలను శుభ్రం చేయాలని పలుమార్లు పంచా యతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వను శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆళ్లగడ్డ టౌన్ ఎస్ఐగా శ్రీనివాసగౌడ్



ఆళ్లగడ్డ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ టౌన్ నూతన ఎస్ఐగా శ్రీనివాసగౌడ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి పదోన్నతిపై ఎస్పీ కార్యాలయంలో ఎస్ఐగా రిపోర్టు చేశానన్నారు. ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ టౌన్ ఎస్ఐగా బాధ్యతలు చేపట్టినట్లు వివరించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక


ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

సంజామల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సంజామల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన విద్యార్థినులు జా తీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శ్రీలేఖ శనివారం తెలిపా రు. డోన్ పట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17, 14 స్కిప్పింగ్ పోటీల్లో విద్యార్థినులు తపస్వి, గురుహరిత, కీర్తన, యా ద్వితీయ ప్రతిభ కనబరిచి బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధిం చారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

డీఎస్సీ ర్యాంకర్‌కు సన్మానం

కొలిమిగుండ్ల, ఆగస్టు 30 (ఆంధ్ర జ్యోతి): డీఎస్సీ -2025లో జిల్లాస్థా యిలో 45 ర్యాంకు సాధించిన నాగి శెట్టి పల్లె గ్రామానికి చెందిన సోమ శేఖర్ నాయుడును స్నేహితులు శనివారం సన్మానించారు. గ్రామంలో యువతకు సో మశేఖర్ నాయుడు స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ


క్రీడా దుస్తులతో విద్యార్థులు

దొర్నిపాడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు చెన్నకేశ్వరి క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో హెచ్ఎంగా విధులు నిర్వహించిన పి.శ్రీనివాసరావు విద్యార్థులకు క్రీడా దుస్తులను అందజేశారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , పీఈటీ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా క్వారీ


మల్లేవేములలో ప్రమాదకరంగా ఉన్న క్వారీ


చాగలమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేవేముల గ్రామంలో ప్రధాన రహదారి పక్కన క్వారీ ప్రమాదకరంగా మారింది. కేసీ కాలువ లీకేజీ నీరు క్వారీలోకి చేరుతోంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారి వెంట రాకపోకలు సాగిస్తుంటాయి. భారీగా నీరు నిల్వ ఉండటంతో వాహనదారులు ఆదమరిస్తే ప్రమాదానికి గురి కావాల్సి వస్తుంది. ప్రమాదాలు జరు గకుండా క్వారీ వెంట రక్షణ గోడ ఏర్పాటు చేయాలని వాహన దారులు, గ్రామస్థులు కోరుతున్నారు.

3న యాగంటిలో దుకాణాలకు వేలం

బనగానపల్లె, ఆగసు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి క్షేత్రంలో పలు దుకాణాలకు సెప్టెంబరు 3న దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ డి. పాండురంగారెడ్డి శని వారం తెలిపారు. ఏడాది కాలానికి టెంకాయల విక్రయానికి, పండ్లు, బొమ్మలు, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునేందుకు, సామాన్లు భద్రపరిచే గది నిర్వహణకు వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు దేవాదాయ శాఖ నిబంధనలకు లోబడి వేలంలో పాల్గొనాలని సూచించారు. వివరాలను యాగంటి క్షేత్రం లోని కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన కోరారు.

తూము వద్ద కుంగిన గట్టు

- ప్రమాదపు అంచున చినరాజ చెరువు


చిన్నరాజచెరువు తూమువద్ద కుంగిన గట్టు

రుద్రవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమాయపల్లె చినరాజచెరువు రెండో తూము వద్ద గట్టు కుంగి ప్రమాదకరగా మారింది. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తూము వద్ద రెండు చోట్ల గట్టు కుంగింది. అధికారులు చర్యలు తీసుకుని మరమ్మతులు చేయాలని రైతులు కోరారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ

బనగానపల్లె, ఆగసు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన ఉండాలని బనగానపల్లె జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. న్యాయాధికారి ప్రతిమ మాట్లాడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లల సంరక్షణ చట్టం, మాదకద్రవ్యాల నిరోధక చట్టం, పీసీఆర్ చట్టం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ సమాజంలో ఐక్యంగా జీవించాలని సూచించారు. సమావేశంలో న్యాయవాదులు అజాంహుసేన్, అల్లావుద్దీన్, ముజఫర్, తులసీశ్వరమ్మ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రతిమ

రోగులకు అందుబాటులో ఉండండి

ఉయ్యాలవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ ఆదేశించారు. శనివారం పెద్దయమ్మనూరు ప్రాథమిక వైద్యశాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు ప్రబలించకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెల కనీసం ఐదు ప్రసవాలు అయ్యేలా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు నాగమస్తాన్, ఉశేన్, ఎంపీహెచ్‌ఈవో మునిస్వామి ఉన్నారు.

దొర్నిపాడు వైద్యశాలలో రికార్డుల పరిశీలన

దొర్నిపాడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ తనిఖీ చేశారు. వైద్యశాలలో రోగులకు అందిస్తున్న ఆరోగ్య సేవలు, మందులను పరిశీలించారు. ఓపీ విభాగంలోని రికార్డులను, రిపోర్టులను తనిఖీ చేశారు. విధుల పట్ల అలసత్వం చేయరాదని అన్నారు. ప్రతి రోగికి మెరుగైన ఆరోగ్య సేవలు అందేలా చూడాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రుహుల్లాఖాన్, శివకుమార్, సిబ్బంది ఉన్నారు.


ఉయ్యాలవాడ: రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

ఉపాధి పనులపై అవగాహన పెంచుకోవాలి

ఉయ్యాలవాడ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్వామిత్వా టీం ఎస్సార్పీ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఎస్.కొత్తపల్లెలో గ్రామంలో కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులు ఏ విధంగా పొందాలి, ఎంత పని చేస్తే ఎంత వేతనం వస్తుందో వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, డీఆర్పీలు రవికుమార్, మల్లికార్జున ఉన్నారు.

నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

రుద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సచివాలయాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసరు శివారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆలమూరు, ముత్తలూరు, చందలూరు గ్రామాల్లోని సచివాలయాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి వివరాలు తెలుసుకున్నారు. సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. సచివాలయ పరిధిలో అన్ని సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాగ్యలక్ష్మి, కార్యదర్శులు ప్రభాకర్, పాములేటి పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ

కొలిమిగుండ్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ ఆఫీస్ బాయ్ మందా గోపాల్‌ను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై కుమారుడు విజయ్‌ను అడిగి తెలుసుకున్నారు. గోపాల్ కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని మంత్రి భరోసా కల్పించారు. కోటపాడు శివరామిరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు దస్తగిరి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..


చాగలమర్రిలో దెబ్బతిన్న 11 కమాండ్ల వక్కిలేరు వంతెన


వక్కిలేరు వంతెనపై దెబ్బతిన్న రక్షణ గోడ

చాగలమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని వక్కిలేరు వద్ద బ్రిటిష్ కాలంలో ఏర్పాటు చేసిన 11 కమాండ్ల వంతెన స్లాబ్ బీటలు వారి ప్రమాదకరంగా మారింది. సైడ్‌వాల్, కల్వర్టు దెబ్బతిన్నాయి. రాత్రి వేళల్లో ఆదమరిస్తే వాహనదారులు ప్రమాదాలకు గురి కావాల్సిందే. ఈ వంతెన పక్కన కేసీ కాలువ, వక్కిలేరు నీరు ప్రవహిస్తున్నాయి. వక్కిలేరు వంతెన కేసీ కాలువ వెంట రైతులు, కూలీలు, వాహనదారులు రాకపోకలు చేస్తుంటారు. వక్కిలేరు వంతెన పైభాగం దెబ్బతినడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.

ఒక పక్క వక్కిలేరు, మరో పక్క కేసీ కాలువ నీరు ప్రవహిస్తుంది. వంతెన పైకప్పు సైడ్‌వాల్ మరమ్మతు పనులు చేపట్టాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగక ముందే పనులు చేపట్టాలని కోరుతున్నారు.


బేతంచెర్లలో బండిపై గణేశుడిని నిమజ్జనానికి తీసుకువెళ్తున్న మహిళలు




పట్టణంలో గణనాథుల శోభాయాత్ర

ప్రశాంతంగా గణేశుడి నిమజ్జనం

బేతంచెర్ల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల్లో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాలు శనివారం ప్రత్యేక పూజలు అందుకొని నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు లడ్డూ వేలాలు నిర్వహించారు. బైటిపేటలోని శ్రీరామ గణేష్ లడ్డూ నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి రూ.1.28 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో వినాయకులను ఊరేగింపుగా ఆయా కుంటలు, బావులు, నదుల వద్ద నిమజ్జనం చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐలు వెంకటేశ్వరరావు, వెంకట్రామిరెడ్డి, మంజునాథ రెడ్డి, ఇంతియాజ్ బాషా, రాకేష్‌బాబు, ఎస్ఐలు రమేష్‌బాబు, మమత, కల్పన, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 150 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు, చాకరాజువేముల గ్రామాల్లో శనివారం వినాయకులను నిమజ్జనం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇన్‌చార్జి ఎస్ఐ రామిరెడ్డి ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కోవెలకుంట్ల : మండలంలోని గుల్లదుర్తిలో వినాయక విగ్రహాలను శనివారం నిమజ్జనానికి తరలించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా కుందూనదికి తరలించి నిమజ్జనం చేశారు. సీఐ హనుమంతునాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


దొర్నిపాడు: నిమజ్జన వేడుకల్లో యువకుల కేరింత


గుల్లదుర్తిలో వినాయకుడి నిమజ్జనం చేస్తున్న యువకులు

గణేశ్ లడ్డూ వేలం


ప్యాపిలి: కలచట్లలో వేలంలో లడ్డూను దక్కించుకున్న వెంకటేశ్

ప్యాపిలి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలచట్ల గ్రామంలో కమ్యూనిస్టు కట్ట దగ్గర ఏర్పాటు చేసిన గణేశుడి లడ్డూను శనివారం నిర్వాహకులు వేలం వేశారు. పలువురు లడ్డూను దక్కించుకునేందుకు పోటీ పడ్డారు. గ్రామానికి చెందిన తలారి పెద్ద వెంకటేశ్ రూ.75వేలకు దక్కించుకున్నారు. ఈ ఏడాది అధిక ధర పలుకడంతో నిర్వాహకుడు ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

చాగలమర్రి: మండలంలోని మల్లేవేముల గ్రామంలో ఎస్సీ కాలనీలో కొలువుదీరిన వినాయకుడి వద్ద శుక్రవారం రాత్రి లడ్డూ వేలం చేశారు. కాలనీకి చెందిన హరిఓబులేసు, సౌజన్య దంపతుల కుమారుడు పవన్‌కుమార్ రూ.21 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు. కార్యక్ర మంలో కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు శిరివెళ్లలో కంటి వైద్య శిబిరం

శిరివెళ్ల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉల్లి నాగేష్ కాంప్లెక్స్‌లో ఆయుష్ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో ఉదయానంద ఆస్పత్రి సహకారంతో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ, ఖండె శ్యాంసుందర్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శిరివెళ్ల, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఈఈ నాగేంద్ర, ఏఈ నాగేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో విగ్రహాలు బయలుదేరు సమయం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఏమైనా అవసరాలు, సమస్యలున్నా 944081335, 944081 3369, 9493193227లను సంప్రదించాలన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే లక్ష్యం

చాగలమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉల్లాస్‌తో సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఉల్లాస్-అక్షరాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ మేటీలు, ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి లాభాపేక్ష లేకుండా బోధన చేసేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. ఉపాధి పనులకు వచ్చే మహిళలను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. కార్యక్రమంలో ఏపీవో ఉమామహేష్, కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను ఉపాధ్యాయులు పెంచాలని ఎంఈవో న్యామతుల్ల సూచించారు. శనివారం జ్ఞానాపురం, చిన్నవంగలి గ్రామాల్లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎంలు సుధాకర్ గుప్త, మస్తాన్, విజయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువుల వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శనివారం చాగలమర్రి పశువైద్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ వర్షాల వల్ల పశువులకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి ముందస్తుగా వైద్య చికిత్సలు చేయించాలన్నారు. 75 శాతం సబ్సిడీతో రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్నామన్నారు.